నా కు నచ్చిన నా కథ

# పరిణామం

## పొన్నాడ కుమార్

**చా**లా కాలం తరవాత కాంతారావును కలుసుకున్నాను.

అతన్ని చూద్దామని వెళ్తూంటే 'ఆడబోయిన తీర్థమెదురైనట్లు' అతనే నన్ను చూసి పలకరించాడు.

కాంతారావును నేను మొదట బొత్తిగా గుర్తు పట్టలేకపోయాను. మగాడికూడా ముద్దొచ్చే చంద్రబింబం లాంటి అతని ముఖం వికృతంగా వుంది. పసినిమ్మపండు లాంటి దేహచ్ఛాయ మసి పూసినట్లుంది. తలనీలాలు లేవు. కళ్లల్లో పూర్వకాంతి లేదు. మనిషి దిగాలుపడి వున్నాడు. బాగా చిక్కిపోయాడు.

నా రెండు భుజాల్నీ పట్టుకుని ఎంతో ఆప్యాయంగా అడిగాడు, "బాగున్నావా? ఎప్పుడొచ్చావు? అక్కడే వుంటున్నావా? మీ ఆవిడా, పిల్లలూ ఎక్కడ? నీ దగ్గరే వుంటున్నారా?" ఇలా ప్రశ్నల వర్షం కురిపించాడు. అతడి కంఠస్వరం క్షీణించిపోయివుంది.

నా పెళ్లికి శుభలేఖ పంపించాను కాబట్టి, పెళ్లికి అతను రాకపోయినా ఇప్పుడు నాకో భార్య వుంటుందనీ, భార్య వుంటుంది కాబట్టి బిడ్డలు వుంటారనీ, నా గార్హస్థ్యజీవనసరళిని నిర్ధారించడంలో లౌకికసిద్ధాంతరీత్యా అతడేమీ పొరపడలేదు.

పై రాష్ట్రాల్లో ఉద్యోగరీత్యా తిరిగి తిరిగి పదేళ్ల తరవాత స్వరాష్ట్రానికి బదిలీ మీద వచ్చిన నాకు, మిత్రబృందాన్ని చూడాలనీ, ముఖ్యంగా కాంతారావును కలవాలనీ తహతహ ఎక్కువవడంతో, పెళ్లాన్నీ, పిల్లల్నీ పల్లెలో దింపి, ప్రివరేటరీ లీవులో పట్నానికి బయలుదేరి వచ్చాను. ఆ సంగతే చెప్పాను.

కాంతారావు స్థానికుడు. డబ్బున్నవాడు. ఉద్యోగం చేయవలసిన కర్మ అతడికి లేదు కాబట్టి ఎక్కడికీ పోవలసిన అవసరం కూడా లేదు. మిగిలిన మిత్రుల ఉనికి కూడా అతడు చెప్పగలడనే ఆశ నాకుంది.

పదేళ్ల కిందట మేము విడిపోయినప్పుడు అప్పటికి పూర్వమే ఎన్నో విషయాల్లో భేదాభిప్రాయాలు మాలో పొటమరించివున్నాయి. అయినా, ఇన్నేళ్ల ఎడబాటు వాటినన్నిటినీ మరపించి మళ్లీ ఒకర్నొకరు కలుసుకోవడానికీ, తెలుసుకోవడానికీ దోహదం చేసింది.

మాకు రంగు భేదం తప్ప వయోభేదం లేదు. మాది వచ్చే కాలం గానీ పోయే కాలం కాదు. అయినా, అతని ఇప్పటి ఆకారవికారాలు చూస్తూంటే ముప్ఫయ్ మూడేళ్ల ప్రాయంలో వయసు తెచ్చిన సహజమైన మార్పు అని తప్పు అంచనా నేను వేయలేను.


అతడి క్షేమసమాచారాలు ఇంత కాలం నాకు తెలియలేదు. నా ఉత్తరాలకు కనీసం ఒక్కదానికైనా అతడు జవాబీయలేదు. అతడికి పెళ్లి అయిందో, లేదో కూడా నాకు తెలీదు. అతడి తల్లి ఎలా వుందో అసలే తెలీదు. ఆత్రుతగా అడిగాను: "ఇప్పుడు నీ సంగతి చెప్పు. ఏమిటింత ఘోరంగా తయారయావు?"

"నా ఉత్తరం అందలేదా? పాత ఎడ్రస్సొకటి కనబడితే గౌహతికే పది రోజుల కిందట రాశాను. అన్ని సంగతులతో 'నీకొక్కడికే రాయాలనిపించి రాశాను" అన్నాడు కాంతారావు. అతడి కళ్లలో నీళ్లు తిరిగాయి. "ఇంకెక్కడి అమ్మ?! నెల్లాళ్ల కిందటే పోయింది. నిన్నే తలుచుకుంటూ పోయింది."

నాక్కూడా ఏడుపొచ్చింది. ఏకైకసంతానమైన కాంతారావుకు ఆమె కన్నతల్లే అయితే, నాకు పెంపుడు తల్లి. కాంతారావుకు తండ్రి లేని లోటూ, నాకు తల్లీ, తండ్రీ లేని లోటూ ఆమె తీర్చింది. వాళ్లింట్లో కాంతారావుకు తోడుగా, అతడితో సమానంగా తిండీ, బట్టా, పడకా ఏర్పాటు చేసింది. స్కాలర్ షిప్పుల మీద పేదవిద్యార్థిగా చదువుకుంటూన్న నన్ను, కాంతారావుకు ఓ మంచి మిత్రుడుగా ఎన్నిక చేసింది. ఆమెకు నేను ఎంతగానో ఋణపడివున్నాను. అతన్ని ఓదార్చడం నా విధి.

"టెలిగ్రామ్ ఇచ్చివుంటే ఆఖరి ఘడియల్లో అయినా ఆమెను చూడగలిగివుండేవాణ్ణి గదా! మాతృవియోగం భరించరానిది. తల్లి లేని లోటు భర్తీ చేయడానికి ఈ ప్రపంచంలో మరో వస్తువేదీ లేదు. నీ దుఃఖంలో పాలు పంచుకుంటున్నాను. తల్లిని పోగొట్టుకున్న వాళ్లందరూ దురదృష్టవంతులు. అయినా, మన చేతుల్లో లేనిదానికి మనమేం చెయ్యలేం గదా?" అంటూ నా సంతాపాన్ని వెలిబుచ్చాను.

డాక్టర్ నాయుడు గారి కారు హారన్ నడిరోడ్డు మద వున్న మమ్మల్ని పేవ్ మెంట్ మీదికి నడిపించింది. అక్కణ్నుంచి ఇద్దరం హోటల్లో దూరి కాఫీ చప్పరించి ఇంటి దారి




*1971 నుంచి ఆంధ్రప్రభ సచిత్రవారపత్రికకు అప్పుడప్పుడూ కథలను అందిస్తున్నాను.*

*"నిజమైన కవిత, కథ జీవితం కంటే ఓ గంటైనా ముందుండాలి. సమస్యాపరిష్కారానికి మరణమే శరణ్యం కాకూడదు. నైతికంగా, మానసికంగా, శారీరకంగా చితికిపోయి అర్ధంతరంగా చచ్చిపోదామనుకునే మనుషులకు ఆత్మస్థైర్యం, మనోబలం చేకూర్చి, కథల్లోనైనా, నిజజీవితంలోనైనా అలాంటి వారిని బతికించండి."*

*స్వర్గీయ పుప్పల లక్ష్మణరావు (బరంపురం) గారు ఉటంకించిన పై మాటలే ఈ కథకు స్ఫూర్తి.*

*ఆంధ్రప్రభ పాఠకులకు నచ్చిన ఈ కథ నాకూ నచ్చిన కథే. ఇది ఇదే వారపత్రికలో 1986లో ప్రచురితమైంది.*

**-రచయిత**



పట్టాం.

దారి పొడవునా కాంతారావు పరితపించాడు. ఎంతగానో ఘోషించాడు. తాను ఓ సామాజికనేరం చేసిన దోషినన్నాడు. ఓ సాంఘికక్రౌర్యం సల్పిన ద్రోహినన్నాడు. అరడజను పసికందుల్ని చంపేశానన్నాడు. ఓ స్త్రీని చంపేస్తున్నానన్నాడు.

నాకు భయం వేసింది. అనుమానం కలిగింది. ఆశ్చర్యం కలిగింది. 'ఓ కలియుగకృష్ణుడు అపరకంసుడుగా మారిపోయాడేమిటి? ఓ జల్సారాయుడిలో, ఓ భోగలాలసుడిలో ఏమిటీ వికృతపరిణామదశలు? ఇతడు జీవితంలో ఎటు పయనిస్తున్నాడు?' ఇలా నాలో ఎన్నో ప్రశ్నలు... మరెన్నో సందేహాలు... "ఏమిటిదంతా? సరిగ్గా చెప్పు!" అని ఉత్కంఠతో అడిగాను.

కాంతారావు రక్కున నా చెయ్యి పట్టుకున్నాడు. గాద్గదికంగా అన్నాడు "శ్రేయస్సు కోరే ఆప్తమిత్రుణ్ని తిరస్కరించాను. అభివృద్ధిని కాంక్షించే కన్నతల్లిని కసిరికొట్టాను. జ్ఞానాన్ని ప్రసాదించే గురువును ధిక్కరించాను. ఓ మనిషి బాగు కోసం, భవిష్యత్తు కోసం ఆ ముగ్గురూ ఎంత అవసరమో, ఎంత ప్రయత్నిస్తారో నాకిప్పుడు తెలిసి వచ్చింది."

'పశ్చాత్తాపం ఆలస్యంగా కలుగుతుంది గదా' అనుకుని అతన్ని ఊరడించాను. అతడి పూర్వచరిత్ర నాకు కొంత తెలుసు.

పేవ్ మెంట్ మీద నడుస్తూనే వెంకటేశ్వరుడి కోవెలా, అమ్మవారి గుడీ దాటి కాంతారావు ఇల్లు చేరుకున్నాం.

లంకంత ఇల్లు చూస్తుంటే బాల్యస్మృతులు నన్ను కలవరపెట్టాయి.

ఓ పక్క కాంతారావూ, నేనూ కలిసి చదువుకున్న గది ఇప్పుడు శూన్యంగా వుంది. మరో పక్క నా పడక గది ఇప్పుడు ఖాళీగా వుంది. ఆ వెనుక కాంతారావు గది. అప్పుడు ఫోమ్ ఫ్రాగ్రెన్స్‌తో నిండివుండేది. ఇప్పుడు మందుల కంపు కొడుతూంది. ఆ గది చూడాలనిపించలేదు. పక్క

*పెళ్లి కాక ముందే నాకు సోకిన రోగాల సంగతి బయట పెట్టుకోవడానికి నిర్లక్ష్యం, రోగం రట్టు, సంసారం గుట్టు వుండాలని తరవాత తెలిసినా, ఎవరితోనైనా చెప్పుకోవడానికి బిడియం, సాహసించి డాక్టర్ల దగ్గరికి వెళ్లేసరికి మించిపోయింది తరుణం. ఆఖరికి మిగిలింది శరీరం నిండా తూట్లు, రక్తం నిండా విషం. క్రానిక్ పేషెంట్లుం. మాకు మేమే శత్రువులం. వంశవృక్షాన్ని కూల్చిన వేరు పురుగులం.*

నుండే వచ్చేశాను. అమ్మతో నిండుగా వుండే గది ఇప్పుడు దేవత లేని గుడిలా వుంది.

"అప్పుడు ముగ్గురం వుండేవారం-నువ్వూ, నేనూ, అమ్మా" అన్నాను.

"ఇప్పుడు ఇద్దరమే-నేనూ, నా శ్రీమతీ" అన్నాడు.

డ్రాయింగు రూమ్‌లో నన్ను కూర్చోబెట్టి ఎప్పుడు లోపలికెళ్లి చెప్పాడో గాని, కాంతారావు భార్య నడవలేక నడవలేక నడిచివచ్చి కాఫీ కప్పులు బల్ల మద పెట్టి నమస్కరించింది. పరిచయాల అనంతరం నాకు ఇద్దరు పిల్లలని తెలిసి కళ్ల నీళ్లు పెట్టుకుంది.

కాంతారావు పాతసంగతులన్నీ చెప్తూ గోడకున్న పెద్ద ఫోటో చూపించి వివరణ ఇచ్చాడు. ఫోటోలో అమ్మ పక్క కుడిఎడమలుగా నేనూ, కాంతారావూ నిల్చుని వున్నాం.

"మీరెలాగూ చాలా కాలం తరవాత బదలీ మీద ఈ ఊరొచ్చారు. మీ గురించి ఆయన చెప్పగా ఇదివరకు విన్నాను. అత్తగారు మిమ్మల్నే కలవరించేవారు. వదినగారూ, పిల్లలూ, మీరూ వచ్చి మా ఇంట్లోనే వుండండి. ఈ ఇల్లు మీకు కొత్త ఏమీ గాదు. పైగా మాకు సాయంగా వుంటారు" అని ఆప్యాయంగా కాంతారావు భార్య కోరింది.

ఆమెను చూస్తూంటే, ఆమె మాటలు వింటూంటే నాకెంతో జాలి వేసింది. బాధ కలిగింది. ఆ ఎముకలగూడు గుమ్మాన్ని ఆనుకుని నిలబడే వుంటే కూర్చోమన్నాను. మర్యాదస్తురాలు. సత్సంప్రదాయం గల కుటుంబం నుండి వచ్చిన మనిషి అని కాంతారావు మార్గమధ్యంలో ముందే చెప్పాడు.

ఆమెలోని రక్తం ఏ రాక్షసుడో తాగేసినట్లుంది. మాంసం ఏ అఘోరో తినేసినట్లుంది. పుత్తడిబొమ్మ ఇత్తడిబొమ్మగా మారిపోయినట్లుంది. మ్రాన్పడి ఆమె వైపే చూస్తున్నాను.

"ఏంవిటలా చూస్తున్నావు?" కాంతారావు నా తొడ చరిచాడు.

నేను మాట్లాడలేదు.

ఆమె గుమ్మం దగ్గర్నుంచి కదిలి మెల్లగా లోపలికి జారుకుంది.

"ఆమె రోగిష్టిది. మెంటల్ బాలెన్స్ ఇప్పుడిప్పుడే తప్పిపోతూంది" మెల్లగా అన్నాడు కాంతారావు.

"ఏంవిటిది? భార్యాభర్తలిద్దరూ ఎందుకిలా రోగగ్రస్తులయ్యారు? డాక్టరుకు చూపించుకున్నారా?" తీక్షణంగా అడిగాను.

"చూపించుకోకేం? బాగుపడే యోగం లేనప్పుడు డాక్టరేం చేయగలడు? నాప్రవర్తన మార్చుకుని ఇంటి పట్టునే వుంటానమ్మా అన్నా వినక, ఈమెను వద్దు మొర్రో అంటున్నా నా మెడకు గుదిబండలా తగిలించి పోయింది అమ్మ. ఈమెను నేను మోసం చేశాను. అన్యాయం చేశాను. అందాన్నీ, ఆరోగ్యాన్నీ హరించేశాను. ఆఖరికి జీవచ్ఛవంగా మిగిల్చాను. ఆరేళ్లలో ఆరుగురు బిడ్డల్ని చంపేశాను-ముగ్గుర్ని ఆమె కడుపులోనూ, మరో ముగ్గుర్ని భూమ్మీద పడిన మరుక్షణంలోనూ..."

నాకు అసలు విషయం బోధపడసాగింది. "డబ్బున్నవాడివి. మంచి స్పెషలిస్టును చూడకపోయావా?" అన్నాను అనుమానాస్పదంగా.

"డబ్బునూ, వైద్యశాస్త్రాన్నీ కూడా మింగేసే విషక్రిములు నరుణ్నీ, నారాయణుణ్నీ కూడా కబళించేస్తాయి. నాకు తగులుకున్న భయంకరవ్యాధులు నా భార్యకు అంటుకున్నాయి. మా ఇద్దరిలో అవి జీర్ణించుకుపోయాయి. మా రోగాలు మా సంతానానికి సంక్రమించాయి. పెళ్లి కాక ముందే నాకు సోకిన రోగాల సంగతి బయట పెట్టుకోవడానికి నిర్లక్ష్యం, రోగం రట్టు, సంసారం గుట్టు వుండాలని తరవాత తెలిసినా, ఎవరితోనైనా చెప్పుకోవడానికి బిడియం, సాహసించి డాక్టర్ల దగ్గరికి వెళ్లేసరికి మించిపోయింది తరుణం. ఆఖరికి మిగిలింది శరీరం నిండా తూట్లు, రక్తం నిండా విషం. క్రానిక్ పేషెంట్లం. మాకు మేమే శత్రువులం. వంశవృక్షాన్ని కూల్చిన వేరు పురుగులం. మృతశిశువులను, అల్పాయుష్కులైన అంధులను, అవిటివాళ్లను తల్లి కడుపు నుండే నేరుగా దిగుమతి చేసుకున్న దుర్వ్యాపారులం." కాంతారావు ఆక్రోశిస్తూ సోఫాలో జారగిలబడిపోయాడు.

కాంతారావు ఇంత ఆవేదనకూ, ఇంత ఆరాటానికీ గురి అవుతాడని అనుకోలేదు. ఇన్ని బాధలూ, వ్యథలూ అతన్ని పీడిస్తున్నాయనుకోలేదు.

చిన్నప్పుడే తండ్రి పోగా తల్లి చేసిన అతి గారాబం, కూర్చుని తిన్నా తరగని కొండంత ఆస్తికి లభించిన వారసత్వం, ఇంట్లో వెనకా ముందూ ఏకోదరులు ఎవరూ లేకపోగా కలిగిన ఒంటరితనం, చీటికీ మాటికీ కాలేజీ సమ్మెల మూలంగా ఒనగూడిన సోమరితనం, నిరంకుశజీవనానికీ, స్వేచ్ఛకూ హేతువులై కాంతారావును తప్పు దారి పట్టించాయి.

నన్ను కూడా చాలామంది గేలి చేశారు. కొంత మంది పెద్దలూ, "నీ స్నేహితుడెలాటివాడో చెప్తే నీ సంగతి ఆలోచించి చెప్తాం" అని నేను జీవితంలో స్థిరపడేముందు నన్ను అనుమానించి అవమానిస్తూంటే, డిగ్రీ పుచ్చుకున్న మరు సంవత్సరంలోనే కాంతారావునూ, ఆ ఇంటినీ వీడి బయటకు వచ్చేశాను.

అంతకు ముందు జరిగిన అనేకసంఘటనలు నాకిప్పటికీ గుర్తున్నాయి. నేను గదిలో ఒక్కణ్నే అర్ధరాత్రి దాటేవరకూ చదువుకుంటూంటే, ప్రతి రాత్రీ కాంతారావు తల్లి కళ్లలో వత్తులు పెట్టుకుని కొడుకు కోసం ఎదురుచూసేది. క్లబ్బులకూ, డాన్సులకూ, వినోదాలకూ, విలాసాలకూ అప్పటికే అతడు బాగా అలవాటు పడిపోయాడు. అతని




## బాక్సర్‌సైజ్

ఏంటి ఈ ఫొటోలో ఉన్న అమ్మాయి ఇలా టి.వి స్క్రీనుపై 'పంచ్' చేస్తోందని ఆశ్చర్యపోతున్నారు కదూ! ఇపుడు బాక్సింగ్ చేయాలంటే ఏ బాక్సర్‌తోనో నేరుగా తలపడాల్సిన అవసరం లేదు. జపాన్‌కు చెందిన ఓ బొమ్మలు తయారుచేసే కంపెనీ బాక్సింగ్ కోసం ఒక ప్రత్యేకమైన టి.వి రూపొందించారు. ఇందులో టి.వి.స్క్రీనుపై కనిపించే బాక్సర్‌తో డైరెక్ట్ బాక్సింగ్ చేయొచ్చు. ఇదొక కొత్తరకమైన వీడియోగేమ్ అన్నమాట. ఆ బొమ్మలకంపెనీలో పనిచేసే ఓ అమ్మాయి ఆ టివి స్క్రీనుపై కనిపించే బాక్సర్‌తో బాక్సర్‌సైజ్ చేస్తోన్న దృశ్యం అది. దీన్ని 'ఎక్సైట్ బాక్సింగ్' అంటారు. ఈ కొత్త టివి ఖరీదు 6,980 అమెరికన్ డాలర్లు.

జె.

# జాగింగ్ వల్ల ఎముకలు దృఢం

జాగింగ్ చేసే వారి ఎముకలు బాగా దృఢంగా వుంటాయని ఆరోగ్యానికి సంబంధించిన ఓ అమెరికన్ జర్నల్ చెబుతున్నది. అంతే కాకుండా ఓస్టియోపోరోసిస్ జబ్బు రాకుండా కూడా వుంటుందట. నెలకు కనీసం తొమ్మిది సార్లు జాగింగ్ చేసేవారి ఎముకల దృఢతను పరిశీలిస్తే, అంత కన్నా తక్కువగా జాగింగ్ చేసేవారి ఎముకల కన్నా ఐదు శాతం బలంగా వున్నాయట. ఏ విధమైన వ్యాయామమూ అసలు చేయనివారి ఎముకలు ఎనిమిది శాతం పై వారి కన్నా బలహీనంగా వున్నాయట. ఈ పరిశోధన చెబుతున్నదేమిటంటే, ఎముకల దార్ఢ్యం కోసం తీవ్రవేగంతో పరుగెత్తనవసరం లేదట. ఓస్టియోపోరోసిస్ మహిళల్లోనే ఎక్కువగా కనిపించినప్పటికీ, పురుషులనూ ఈ జబ్బు వదలటం లేదు. యాభై లక్షల మంది అమెరికనులకు ఈ జబ్బుంది. తొంభై లక్షల మందిలో ఎముకలు బలహీనంగా వుండటం వల్ల ఈ జబ్బు వచ్చేందుకు అవకాశాలేర్పడ్డాయట. వీరిలో 80 శాతం మంది మహిళలేనట. కనుక ఎముకలు సుదృఢంగా వుండాలని కోరుకునేవారు తప్పకుండా జాగింగ్ చేయాలి.

ఎస్.



పడక గదిలో దిండ్ల కింద రకరకాల చెత్త పుస్తకాలు, ఉత్తరాలు, చిత్రాలు కనబడేవి. కాంతారావు తల్లి వాటిని కాల్చేసేది. మళ్లీ పోగు పడేవి. మళ్లీ దహనమయేవి. నేను కూడా ఆమెకు సాయం చేసేవాణ్ని. అందుకు మా ఇద్దరి మీదా చేయి చేసుకునేవాడు.

కొంటెగా చూసే ప్రతి కోణంగినీ, వయ్యారంగా నడిచే ప్రతి భామనూ, పలచటి బిగుతు దుస్తుల్లో వంపులు కనబరిచే ప్రతి కాంతనూ "కాంతా, రావా?" అని కాంతారావు ఈలలు వేసి, కన్ను కొట్టి పిలిచినప్పుడు, చెంప ఛెళ్లుమనిపించిన వారున్నారు. వారిని మినహాయిస్తే, అతని సిరికీ, మగసిరికీ లొంగిపోయిన కన్యలు పెళ్లి కాని తల్లులై గర్భశోకాన్ని అనుభవించినవారు కొంతమందీ, ఆత్మహత్యలు చేసుకున్నవారు ఇంకొంతమందీ వున్నారు. ఉంపుడుగత్తెల ద్వారా సుఖాలకు బదులు సుఖవ్యాధులను డబ్బిచ్చి కొనుక్కుని ఈ నాడు బాధ పడుతూంటే, దానికి ఎవరు బాధ్యులు? యువతరం స్వేచ్ఛాప్రణయానికి అడ్డు కట్టలు వేయడం ఎవరికి సాధ్యం? అందం, ఆరోగ్యం, ఐశ్వర్యం మనిషికి వరాలే అయితే, వాటిని హరించేయగల వ్యసనాలు శాపాలు. కుళ్లిన వళ్ల నుండి పురుగులు రాల్తాయి. అవి బుట్టల్లో వున్న మంచి పళ్లకూ వ్యాపిస్తాయి.

"ఏమిటి? ఇప్పుడు మా బ్రతుకుల గురించే ఆలోచిస్తున్నావా? చెప్పు. మా జబ్బులు మాతోటే అంతం కావాలి. మా తప్పులకు మా సంతానం శిక్ష అనుభవించకూడదు. ప్రవహించే నదిలో నీరు వెనుతిరిగి రానట్లే కాలంతో కరిగిపోయే వయసు తిరిగిరాదనే నీతిని గుడ్డిగా అనుకరించి పతనమైపోయాను. జీవితం సుఖం అనుభవించడానికే అనే సూక్తికి వక్రభాష్యం చెప్పుకుని సర్వనాశనమైపోయాను. బురదను నీటితోటే కడగాలి. తేటనీటి లాటి మంచి మనసు గల మిత్రుడివి. ఈ స్థితిలో నాకు సలహా ఇవ్వగల స్వతంత్రం, వివేకం నీకొక్కడికే వున్నాయి. మా బ్రతుకులకు నిష్కృతి చూపించు. లేదా మమ్మల్నిద్దరినీ ఒకేసారి చంపెయ్యి!" కాంతారావు జాలిగా, నిస్పృహతో అర్థించాడు.

సమస్యాపరిష్కారానికి మరణమే శరణ్యమైతే ప్రపంచంలో ఇంతమంది ఇంకా బతికే వుండేవారా? తప్పు చేసినవారిని చావమని తీర్పు చెప్పడం చాలా సులువు. కాంతారావునూ, పెళ్లాన్నీ చావమని నేను చెప్పను. సంఘసంస్కరణాభిలాషులైన శాస్త్రవేత్తలు శాస్త్రవిజ్ఞానాన్ని మానవాళి శ్రేయస్సు కోసం ఉపయోగించడం ద్వారా కొంతలో కొంత వ్యక్తికీ, సమాజానికీ, దేశానికీ మేలు చేకూర్చుతున్నప్పుడు బ్రతుకంటే మనిషి ఎందుకు భయపడాలి? కాంతారావు ఇప్పుడు నైతికంగా, శారీరకంగా, మానసికంగా చితికిపోయాడు. బ్రతుకంటే బెదిరిపోతున్నాడు. నేరానికి శిక్ష అనుభవిస్తున్నాడు. కాంతారావు భార్య, భర్త కన్నా ఎక్కువ బాధననుభవిస్తూంది. వారిద్దరూ రోగవిముక్తులు కాకపోయినా, చచ్చేవరకైనా బతకాలి! అందుకు వారికి మనోధైర్యం కావాలి! ఆత్మబలం కావాలి!

ఆశగా నా వైపే చూస్తున్న కాంతారావు కళ్లలోకి చూస్తూ అన్నాను-"నీకు డాక్టర్లు ఇంతకు ముందే సలహా ఇచ్చివుంటారు. దాన్ని ఇప్పటి వరకూ నువ్వు పాటించినట్లు లేదు. నేను బాల్యస్నేహితుడుగా చెప్తున్నాను. మీకు పరిస్థితుల్లో వంధ్యత్వమే శరణ్యం. డాక్టరు దగ్గరకు వెళ్లాం."

"నీ సలహా పాటించదగ్గదే. కాని, తల్లి అవాలనుకునే స్త్రీ సెంటిమెంటు నా భార్య విషయంలో ఏమవాలి?"

ఈ ప్రశ్న కాంతారావు నన్ను అడుగుతాడని తెలుసు. వెంటనే జవాబిచ్చాను-"తల్లులు కానివారు ఈ ప్రపంచంలో ఎవరూ లేరా? కన్నప్రేమ కన్నా పెంచిన ప్రేమే పెద్దదని రుజువు చేసిన స్త్రీలు ఎంతమంది లేరు? ఇప్పుడే ఈ రాత్రికే పల్లెకు పోయి, ఎల్లుండి ఉదయానికి నా భార్యాబిడ్డలను తీసుకువస్తాను. మేము మీకు సాయంగా వుంటాం. 'లవ్లీ'గా వుండే మా పిల్లలు మిమ్మల్నీ, మీ ఇంటినీ లైవ్లీగా చేయగలరు. నీ దగ్గరే ఒక వేళ నిజంగా వాళ్లు పెరగవలసివస్తే నా కన్నా నువ్వే వాళ్లను ఎంతో జాగ్రత్తగా పెంచగలవు!"

తలుపు వెనక నుండి కాంతారావు భార్య కర్టెన్ తొలగించి నా ఎదుటికి వచ్చి, "అన్నయ్య గారూ! ఇది మా ఇల్లు కాదు, మన ఇల్లు. ఎల్లుండి వరకూ కాదు, రేపు ఉదయానికే వదిన గారినీ, పిల్లలనూ తీసుకురండి" అని అర్థిస్తూంటే, కాంతారావు కళ్లలో కాంతిరేఖలు ఆ అసురసంధ్యలో మెరిశాయి.

■